
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 5 డిసెంబరు 2024 | 5



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మొత్తంగా 9618 మంది ఓటర్లు ఉన్నారు.. ఒక్కో జిల్లా పరిధిలో చూస్తే కాకినాడలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. అమలాపురంలో పురుష ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోనే ఓటర్లు తక్కువగా ఉన్నారు.

జిల్లా	కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
కాకినాడ	22	1970	1448	3418
తూర్పు	20	1597	1307	2904
కోనసీమ	22	2165	1131	3296



కోటిపల్లికి సీప్లేన్

6లో

కోనసీమ అందాలను తిలకించేలా ప్రాజెక్టు స్థల పరిశీలన చేసిన రామచంద్రపురం ఆర్డీవో బృందం



రాజమహేంద్రవరంలో ఎన్నికల సామగ్రి తీసుకుంటున్న సిబ్బంది


రాజమండ్రిలో సిద్ధమైన పోలింగ్ బూత్

మా..స్టారెవరో!

నేడే ఎమ్మెల్సీ ఉప పోరు ట మాస్టార్ల చూపు ఎటువైపో

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అంతా సిద్ధమైపోయింది.. గతేడాది పశ్చిమగోదావరి జిల్లా ఉండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి చెందారు. దీంతో ఖాళీ ఏర్పడింది. ఆ స్థానానికి ప్రస్తుతం ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థులుగా గంధం నారాయణరావు, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, నామన వెంకటలక్ష్మి, బొర్రా గోపి మూర్తి పోటీపడుతున్నారు.ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. బ్యాలెట్ పేపర్లపై ప్రాధాన్యతా క్రమంలో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఆరు జిల్లాల పరిధిలో 16,737 మంది ఓటర్లు ఉన్నారు. 116 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుంది. ఆరు జిల్లాల పరిధిలో పోలింగ్‌కు సంబంధించిన సామగ్రి బుధవారం పంపిణీ చేశారు.గురువారం పోలింగ్ పూర్తయిన తరువాత ఆరు జిల్లాల పరిధిలో బ్యాలెట్ బాక్సులను కాకినాడ జేఎన్‌టీయూకే స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చనున్నారు.ఈ నెల 9వ తేదీన కౌంటింగ్ నిర్వహించి ఫలితం ప్రకటిస్తారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్ల వివరాలను ఈ నెల 7వ తేదీలోపు అందజేయాల్సి ఉంటుంది.12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే

- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- 8 గంటల నుంచి పోలింగ్
- 6 జిల్లాలు 116 కేంద్రాలు
- 16,737 మంది ఓటర్లు
- బ్యాలెట్ బాక్సుల్లో ఓటింగ్
- కాకినాడలో స్ట్రాంగ్ రూమ్
- 9న అక్కడే కౌంటింగ్
- 12న కోడ్ ముగింపు




అమలాపురంలో బుధవారం రాత్రి చీకట్లోనే పోలింగ్ ఏర్పాట్లు



రాజమండ్రి నుంచి ఎన్నికల సామగ్రితో సిబ్బంది

కోనసీమలో అంతా ఓకే..

అమలాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండలానికొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.జిల్లాలో అత్యధికంగా అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని సర్వశిక్ష అభియాన్ భవనంలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 60లో 606 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అత్యల్పంగా ఆత్రేయపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 52లో 44 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారు. పోలింగ్ సామగ్రిని తీసుకుని సాయంత్రానికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల పోలింగ్ సిబ్బంది పలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది చీకట్లోనే సెల్‌ఫోన్ లైట్ల వెలుగులోనే పోలింగ్ ఏర్పాట్లను చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బుధవారం ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని స్వీకరించారు. ప్రత్యేక వాహనాలపై పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు తరలించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత తిరిగి ఆయా బాక్సులను కాకినాడ జేఎన్‌టీయూకేకు తరలించే బాధ్యతను కొత్తపేట ఆర్డీవో, తహశీల్దార్లకు అప్పగించారు. ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి 24 మంది ప్రిసైడింగ్ అధికారులు, 24 మంది ఏపీవోలు, 48 మంది ఓపీవోలను నియమించారు. ఏడుగురు రూట్ ఆఫీసర్లు, ఏడుగురు సెక్టోరల్ ఆఫీసర్లతో పాటు మూడు వీడియో బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనను పాటించే విధంగా మండలానికో కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌లతో పాటు నాలుగు మునిసిపాలిటీలకు నాలుగు టీములను నియమించారు. కోనసీమ జిల్లాలో 86 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు.



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఒక బూత్ వద్ద అతికించిన అభ్యర్థుల జాబితా

తూర్పున సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సన్నద్ధం చేశారు.ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సామగ్రి స్వీకరించి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన 20 పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రానికి సిబ్బంది తరలి వెళ్లారు. ఎనిమిది రూట్లలో ప్రత్యేక బస్సుల్లో సిబ్బంది, మెటీరియల్ తీసుకువెళ్లారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.సహాయ రిటర్నింగ్ అధికారిగా డీఆర్‌వో టి.సీతారామమూర్తి వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్పీ నరసింహ కిషోర్ స్వీయ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక బస్సుల్లో పోలీసులు ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, సీఐలు 16, ఎస్‌ఐలు 41, ఏఎస్‌ఐ 69, కానిస్టేబుల్స్ 138, మహిళా కానిస్టేబుళ్లు 34, హోంగార్డులు 38, 19 మందితో రెండు స్పెషల్ పార్టీలు కలిపి మొత్తం 364 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. సిబ్బంది తరలింపును రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత,తహశీల్దార్ పాపారావు, ఎన్నికల సూపరింటెండెంట్ దేవి,డీటీ శాస్త్రి పర్యవేక్షించారు.

కలెక్టర్ పరిశీలన..

కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ఓటర్ల జాబితా అనుసరించి ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, పోలింగ్ ఏజెంట్లకు జారీచేసిన గుర్తింపుకార్డులను పరిశీలించడం, తగిన సిట్టింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొవ్వూరు మండలం లోని 231 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంపీడీవో కె.సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

విధంగా అధికారులు చర్యలు తీసుకోవా లని సహాయ రిటర్నింగ్ అధి కారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు.

డిప్యూటీ తహశీల్దార్‌పై క్రిమినల్ కేసు

అంబాజీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఎంఎల్‌సీ పాయింట్‌లో రేషన్ బియ్యం అవకతవకలకు పాల్పడిన అప్పటి డిప్యూటీ తహశీల్దారు, ఎంఎల్‌సీ పాయింట్ ఇన్‌చార్జ్ గుత్తుల శ్రీనివాసరావుపై క్రిమినల్ కేసు నమోదైంది. అంబాజీపేట ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో సుమారు రూ.1.79 కోట్లు విలువైన 375.513 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అప్పటి ఇన్‌చార్జ్‌గా ఉన్న శ్రీనివాసరావు పక్కదారి పట్టించాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చినప్పటికి ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు విచారణ చేపట్టారు. అవకతవకలు నిర్ధారణ కావడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ముమ్మిడివరం సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్ వి.నాగేశ్వరరావు అంబాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివిధ సెక్షన్లతో శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు. కొత్తపేట డీఎస్పీ గోవిందరావు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.



పచ్చళ్ల ఖజానా నార్కెడిమిల్లి 6లో



ఓడంతా.. జల్లెడ

- స్టెల్లా నౌకలో లోడైన రేషన్ బియ్యం అసలెంత
- నిగ్గుతేల్చడానికి శాంపిళ్లు సేకరించిన అధికారుల బృందం
- భారీ నౌకలో ఒక్కోటి 40 అడుగుల లోతులో అయిదు హేచ్‌లు
- వీటిలో ఇప్పటికే ఒక్కో హేచ్‌లో 14అడుగుల ఎత్తులో బియ్యం బస్తాలు లోడ్
- నౌకలో అయిదు హేచ్‌ల్లో ఇప్పటివరకు 12లక్షల బియ్యం బస్తాలు లోడింగ్
- రేషన్ బియ్యం అనుమానం ఉన్న ఒకటో హేచ్‌లో 4.10 లక్షల ప్యాకెట్లు
- వీటిని అడుగు వరకు తొలగించి శాంపిళ్లు తీయడం అసాధ్యమే
- అయినా తీసిన శాంపిళ్లలో రేషన్ బియ్యం ఆనవాళ్లు నేటికి తేలనున్న వైనం
- తద్వారా బియ్యం సీజ్‌పైనా, నౌక కదలికపైనా స్పష్టత
- ఉదయం పదిన్నర నుంచి రాత్రి వరకు నౌకపై కొనసాగిన తనిఖీలు
- మరోపక్క బియ్యం లోడింగ్ పూర్తవక నౌక సిబ్బందిలో అయోమయం

కాకినాడలో నడిసముద్రంలో ఉన్న స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం అసలు ఎంత ఉంది? అనేది తేల్చడం అధికారులకు తలనొప్పిగా మారింది. 189.99 మీటర్ల పొడవున్న స్టెల్లా నౌకలో అయిదు హేచ్‌ల్లో ఇప్పటివరకు 32,416మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ జరిగింది. ఈ బియ్యాన్ని బస్తాల్లో కొలిస్తే దాదాపు 12.80 లక్షల బస్తాలు. వీటిలో రేషన్ బియ్యం ఎంతనేది గుర్తించడం కష్టంగా మారుతోంది. అయినా అతికష్టంపై అధికారుల బృందం బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకబిగిన తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపి రేషన్ బియ్యం ఉన్నాయా? లేదా? అనేది నిర్ధారించనున్నారు. ఫలితాల ఆధారంగా రేషన్ బియ్యం బస్తాలను ఏంచేయాలి? నౌకను ఎప్పుడు కదలడానికి అనుమతి ఇవ్వాలి అనేది తేల్చనున్నారు. అయితే సముద్రంలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఇంకా లోడింగ్ చాలావరకు చేయాల్సి ఉండడంతో పారా బాయిల్డ్ రైస్‌ను నౌకలోకి గురువారం నుంచి లోడింగ్ మొదలు పెట్టనున్నారు.

(ఆంధ్రజ్యోతి-కాకినాడ/కలెక్టరేట్)

పనామా దేశానికి చెందిన స్టెల్లా ఎల్ నౌక కాకినాడ యాంకరేజ్ పోర్టుకు గత నెల 12న బియ్యం లోడింగ్‌కు వచ్చింది. ఇందులో సరుకు లోడింగ్ పూర్తిచేసుకుని తిరిగి ఇక్కడి నుంచి పశ్చిమాఫ్రికా దేశానికి వెళ్లాల్సి ఉంది. అందులో భాగంగా గత నెల 29 నాటికి 33,400 మెట్రిక్ టన్నుల బియ్యం నౌకలోకి ఎక్కించారు. అయితే ఈలోపు ఎగుమతి అయిన సరుకులో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అవుతోందని సమాచారం రావడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ నేరుగా నౌక వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. అందులో లోడయిన బియ్యంలో 640 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ బియ్యంగా గుర్తించి మిగిలిన బియ్యం నౌకలోకి పంపకుండా నిలిపివేశారు. ఈలోపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడకు వచ్చి రేషన్ బియ్యం ఉన్న నౌకను సీజ్ చేయాలని ఆదేశించారు. ఈలోపు తుఫాను ముప్పు రావడంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో బియ్యం ఎగుమతులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అయితే ఇప్పుడు వాతావరణం అనుకూలంగా ఉండడంతో నౌకలోకి తిరిగి బియ్యం లోడ్ చేసి దాన్ని పశ్చిమాఫ్రికాకు పంపడానికి అనుమతి ఇవ్వాల్సి ఉంది. లేకపోతే డెమరేజీ భారంతోపాటు నౌకను ఆపారన్న వివాదం పెరిగే ప్రమాదం ఏర్పడింది. అటు పౌర సరఫరాలశాఖ సైతం అడ్మిరాలిటీ న్యాయస్థానంలో కేసు వేసినా నౌకను సీజ్ చేయించడం అసాధ్యమని గుర్తించింది. దీంతో నౌకను పంపేయాల్సిన పరిస్థితులు రావడంతో ఇప్పటివరకు లోడ్ అయిన 33,400 మెట్రిక్ టన్నుల బియ్యంలో అసలు రేషన్ బియ్యం ఎంతనేది నిర్ధారించి నిర్ణయం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కస్టమ్స్, రెవెన్యూ, పోర్టు తదితర విభాగాలతో కూడిన పది మంది అధికారుల బృందంతో నౌకలో బియ్యం తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించడానికి పంపాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. దీంతో బుధవారం వీరంతా నౌక వద్దకు చేరుకుని తనిఖీలు చేసి శాంపిళ్లు తీసుకున్నారు.

గుర్తించడం సాధ్యమేనా...

అయితే లోడైన బియ్యంలో అధికారులు తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించినా అందులో అసలు ఎంత రేషన్ బియ్యం ఉందనేది తేల్చడం కష్టంగానే మారింది. గత జూన్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని వ్యాపారులు న్యాయస్థానం ద్వారా బ్యాంకు గ్యారెంటీ ఇచ్చి విడిపించుకున్న బియ్యం, నౌకలో గుర్తించిన రేషన్ బియ్యం ఒకటాకాదా అనేది ప్రధానంగా తేల్చబోతున్నారు. అయితే నౌకలోకి వెళ్లిన తర్వాత అక్కడ బియ్యం బస్తాలను చూసి అధికారులు కళ్లు తేలేసిన పరిస్థితి. పనామా నౌక చాలా భారీ షిప్. ఇందులో మొత్తం అయిదు హేచ్‌లు (ఒక్కోటి 40 అడుగుల లోతులో ఉండే గొడౌన్‌లు) ఉన్నాయి. అన్ని హేచ్‌లు కలిపి ఇప్పటి వరకు 33,400 టన్నుల బియ్యం లోడ్ చేశారు. బస్తాల ప్రకారం చెప్పాలంటే మొత్తం అన్నింట్లో కలిపి 12 లక్షల బస్తాలన్నమాట. ఇందులో హేచ్1లో లోడైన 9,400 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రకారం బస్తాలు 4.10 లక్షలున్నాయి. ఇందులో ద్వారంపూడి వీరభద్రారెడ్డి కంపెనీ అయిన మానస 4,400 మెట్రిక్ టన్నులు, శ్రీ సుముఖ వీరేశ్వర్ కంపెనీ వెయ్యి టన్నులు, శ్వాన్‌చిత్ర కంపెనీ 4 వేల మెట్రిక్ టన్నుల బియ్యం లోడ్ చేసింది. ప్రస్తుతం ఈ హేచ్‌లో అడుగు నుంచి 15అడుగుల ఎత్తులో బస్తాలను పేర్చారు. ఇప్పుడు అధికారులు పైన ఉన్న బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నాయో లేవో తనిఖీ చేసి శాంపిళ్లు తీసుకున్నారు. కానీ వెంట హమాలీలు లేకపోవడం కూడా వీరికి ఇబ్బంది ఉంది. దీంతో 15 అడుగుల కిందనున్న బస్తాలు తీయడం అసాధ్యంగా మారింది. అటు మిగిలిన హేచ్‌ల్లో సైతం బియ్యం బస్తాల్లో గుచ్చి శాంపిళ్లు సేకరించారు. ప్రధానంగా ఈ బియ్యం బస్తాలన్నీ వైట్ లిల్లీ అనే బ్రాండ్ పేరుతో ఉన్నాయి. మరోపక్క శాంపిళ్లను సేకరించి బుధవారం రాత్రి ల్యాబ్‌కు పంపారు. కాగా నౌకలో బియ్యం లోడింగ్ భారీగా జరగాల్సి ఉండడంతో నౌక ఎప్పుడు కదులుతుందో తెలియక అందులో సిబ్బంది అయోమయంతో కనిపించారు.



స్టెల్లా ఎల్ నౌకను తనిఖీ చేస్తున్న రెవెన్యూ, కస్టమ్స్, పోర్టు అధికారులు

చెక్‌పోస్టుల్లో జేసీ తనిఖీలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో ఉన్న చెక్‌పోస్టులను కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రధానంగా బొంబాయి గేటు, శక్తి గ్యాస్ గేటు వద్ద ఉన్న చెక్‌పోస్టులను తనిఖీచేశారు. ప్రతి లారీలో ఉన్న బియ్యం లోడ్‌లను తనిఖీ చేయాలని అక్కడి అధికారులను ఆయన ఆదేశించారు. రోజుకు ఎన్ని లారీలు వెళుతున్నాయి, వాటిని ఎలా తనిఖీలు చేస్తున్నారు, శాంపిల్స్ ఎలా భద్రపర్చుతున్నారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ప్రశాంతంగా 'నాస్' పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాంబాబు

రాయవరం/ద్రాక్షారామ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్ష సమర్థవంతంగా నిర్వహించినట్లు సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. బుధవారం ఆయన రామచంద్రపురం పట్టణంలోని రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలోను, రాయవరం మండలం లొల్లలోను నాస్ పరీక్షలు జరుగుతున్న తీరును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2 వేల 391 మంది విద్యార్థులు నాస్ పరీక్షకు హాజరుకాగా వీరిలో 1277 మంది బాలురు, 1155 మంది బాలికలు పరీక్ష రాసినట్లు చెప్పారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నాస్ పరీక్ష నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 104 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి సీబీఎస్‌ఈ తరపున ఒక్కో అబ్జర్వర్ పర్యవేక్షణలో పరీక్షలను పర్యవేక్షించినట్లు చెప్పారు. డీఈవో షేక్ సలీం బాషా నేతృత్వంలో డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, సీబీఎస్‌ఈ జిల్లా కోఆర్డినేటర్ లాల్సన్ తదితరుల ఆధ్వర్యంలో జిల్లాలో నాస్ పరీక్షలు ప్రశాంతంగా సాగాయని ఏఎంవో తెలిపారు. సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవో ఎం.శ్రీనివాస్, హెచ్‌ఎం విత్తనాల సుబ్బారావు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

● రేపటి నుంచి జనవరి 8 వరకు నిర్వహణ ● జేసీ నిషాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 2025 జనవరి 8 వరకు గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. రాష్ట్ర భూ పరిపాలనా ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి బుధవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం జేసీ నిషాంతి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రధానంగా 22-ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిల్లో షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారు.ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు ఆర్టీజీఎస్, ఏపీ సేవా పోర్టల్ ద్వారా అర్జీలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రెవెన్యూ సదస్సు నిర్వహణకు ముందుగానే ఆయా గ్రామాల్లో ప్రజలకు సమాచారం అందించాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఎటువంటి రుసుము వసూలు చేయరాదని ఆమె స్పష్టం చేశారు. వీలైనంత వరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అక్కడికక్కడ పరిష్కారం కాని సమస్యలను నిర్దేశిత నిబంధనల మేరకు పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఆక్రమణల్లో భూములు కోల్పోయిన బాధితులకు అండగా నిలిచి న్యాయం చేకూర్చాలన్నారు. గ్రామసభల్లో స్వీకరించిన అర్జీలకు సంబంధించి ప్రజలకు రశీదులు అందించాలన్నారు. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో నిర్వహించిన సభల ద్వారా వచ్చిన వినతుల్లోని సమాచారానికి అనుగుణంగా సర్వేశాఖ చర్యలు చేపడుతుందన్నారు. జిల్లాలోని 22 మండలాల్లో 431 గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుల్లో తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొంటారని జేసీ తెలిపారు.

సైబర్ వల

కాకినాడ జిల్లా శంఖవరంలో కాంట్రాక్టర్‌కు టోకరా

రూ.5.20 లక్షలు కాజేసిన వైనం

అల్లవరం మండలంలో వరుస నేరాలు 7లో

నోరూరించే పచ్చళ్ల ఖజానా

నార్కెడిమిల్లి

ఊరంతా పచ్చళ్ల వ్యాపారస్తులే.. దేశమంతా విక్రయం.. 15 రకాల పచ్చళ్ల తయారీ









(ఆంధ్రజ్యోతి/ఆత్రేయపురం)

గోదారోళ్లంటే వెటకారంతోపాటు మమకారం ఉంటుందంటారు.. మమకారంతోపాటు ఘాటైన పచ్చళ్లతోనూ నోరూరిస్తుంటారు. ఈ పచ్చళ్లు ఇంట్లో పెట్టుకోవడం మామూలే. కానీ ఒక ఊరంతటికీ పచ్చళ్లు పట్టడమే జీవనోపాధి. ఊళ్లో చాలామంది ఆడవాళ్లు ఈ పచ్చళ్లు పట్టడంలో ఉపాధి పొందుతుంటే, ఈ పచ్చళ్లను దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేస్తూ మగవాళ్లు బిజీగా ఉంటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి ఊరంతా పచ్చడి వ్యాపారులే. గోదావరి చెంతనే పచ్చని తివాచి పరిచినట్టుంటే కోనసీమ గ్రామాల్లో ఒకటి ఈ నార్కెడిమిల్లి. గ్రామ జనాభా నాలుగు వేలు. సుమారు 400 కుటుంబాలు కలిగిన ఈ నార్కెడిమిల్లిలో ప్రతి గడపలోనూ పచ్చళ్లు తయారు చేస్తున్న దృశ్యాలే కనిపిస్తాయి. పూటగడవడానికి కష్టంగా ఉన్న రోజుల నుంచి నేడు కుటీర పరిశ్రమగా ఎదిగి ఊరంతా ఇలా పచ్చళ్ల వ్యాపారం సాగిస్తు న్నారు. సుమారు 15 రకాల పచ్చళ్లను తయారు చేస్తూ పచ్చడి ప్రియులకు రుచి చూపిస్తున్నారు.

దేశనలుమూలలకూ పచ్చడి రుచులు

నార్కెడిమిల్లి గ్రామంలో తయారు చేస్తున్న పచ్చళ్లను దేశనలుమూలలకు తీసుకుని వెళ్లి ఇక్కడి వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇళ్ల వద్ద కుటీర పరిశ్రమగా పచ్చళ్లను తయారు చేస్తూ ముడిసరుకును వివిధ రాష్ట్రాలకు తీసుకునివెళ్లి మోటార్ సైకిళ్ల ద్వారా ఆయా ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తారు. పూర్వం సైకిళ్లు, కావిళ్లతో వెళ్లి విక్రయించేవారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, బళ్లారి, రాయదుర్గం, రాయచూర్, తమిళనాడులోని చెన్నై, శేలం, కొయంబత్తూర్, ఒడిషాలోని వివిధ జిల్లాలతోపాటు ఆంధ్ర, తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో ఈ పచ్చళ్ల వ్యాపారం సాగిస్తున్నారు. వేసవి సీజన్‌లో మామిడి, మాగాయి వంటి పచ్చళ్లను తయారు చేసి కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుతారు. మూడు నెలలకోసారి తయారుచేసిన పచ్చళ్లను తీసుకుని ఆయా రాష్ట్రాల్లో అమ్మకాలు సాగిస్తారు. ఈ గ్రామం నుంచి వేరే గ్రామానికి కొందరు మహిళలు వెళ్లి పచ్చళ్లు తయారు చేస్తున్నారు. అంకంపాలెం, ర్యాలి, లొల్ల, ఆత్రేయపురం, ఉచ్చిలి, వెలిచేరు గ్రామాల్లో వివిధ రకాల పచ్చళ్ల తయారీ పెద్దఎత్తున జరుగుతోంది. ఇలా పచ్చళ్ల వ్యాపారంతో గ్రామీణులు ఉపాధి పొందుతున్నారు.



ఇక్కడ తయారు చేస్తున్న పచ్చళ్లు...

మామిడి, మాగాయి, నిమ్మకాయ, ఎండుమిర్చి, టమోట, అల్లం, గోంగుర, ఉసిరి, కాకరకాయ, దబ్బకాయ, కరివేపాకు, కొత్తిమీర, మిక్సిడ్ పచ్చళ్లను తయారుచేయడంలో నార్కెడిమిల్లి వాసులది అందివేసిన చెయ్యి. మహిళలు ఈ పచ్చళ్ల తయారీలో నిమగ్నమై ఉంటారు. మగవాళ్లు వివిధ రాష్ట్రాల్లో అమ్మకాలు సాగిస్తుంటారు. మూడు నెలలకోసారి వచ్చి పచ్చళ్లకు సంబంధించిన ముడి సరుకును వ్యాన్ల ద్వారా తరలిస్తూ ఎప్పటికప్పుడు కలుపుకుని అమ్మకాలు సాగిస్తారు. ఎన్నికలు, పండుగల సమయాల్లోనే వలస వెళ్లిన వ్యాపారులు గ్రామంలో ప్రత్యక్షమై సందడి చేస్తారు.



కోటిపల్లికి సీప్లేన్

కోనసీమ అందాలను తిలకించేలా ప్రాజెక్టు

స్థల పరిశీలన చేసిన రామచంద్రపురం ఆర్డీవో బృందం


స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో తదితరులు

కె.గంగవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ తీరంలో పర్యాటకానికి మరింత శోభను తెచ్చేలా సీప్లేన్ (వాటర్ డ్రోమ్) యాత్రను అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కోనసీమ అందాలను సంపూర్ణంగా తిలకించేలా ఈ పర్యాటక ప్రాజెక్టును రూపొందించాలనే యోచనలో ఉన్నారు. ఈ సీప్లేన్ ఎక్కడ నుంచి ఏర్పాటుచేయాలనే దానిపై కసరత్తు కూడా మొదలైంది. ఇందుకు స్థల పరిశీలన నిమిత్తం రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల ఆధ్వర్యంలో అధికారుల బృందం మండల పరిధిలోని కూళ్ల, కోటిపల్లి, కోట గ్రామాల్లో ఏటిగట్టు ప్రాంతాల్లో పరిశీలన చేసింది. ఇటీవల కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకూ నడిచిన ఒక సీప్లేన్ (ఎయిరోడ్రోమ్ అవసరం లేకుండా నీటిపై నిలిచే వాహనం) విజయవంతంగా నడిచిన విషయం విదితమే. దీంతో ఇలాంటి ప్రాజెక్టును ఇక్కడ కూడా ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గౌతమీ గోదావరి నది ఎడమగట్టు కోటిపల్లి నుంచి కోనసీమ అయినవిల్లి, అంతర్వేది తదితర క్షేత్రాలను కలుపుతూ ఈ సీప్లేన్ ప్రాజెక్టును ఏర్పాటుచేస్తే, ఈ ప్రాంతంలో పర్యాటకానికి మరింత చేయూతనిచ్చినట్టు అవుతుందని భావిస్తున్నారు. దీనిలో భాగంగా రామచంద్రపురం ఆర్డీవో అఖిల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారుల బృందం ఏటిగట్టు ప్రాంతంలో పర్యటించి స్థల పరిశీలన చేశారు.

ఏపీటీలో ముగిసిన పాలీటెక్‌ఫెస్ట్

ప్రథమ విజేతగా బీవీసీ విద్యార్థుల ఏఐ సాంకేతిక ప్రదర్శన


ప్రథమ విజేతకు నగదు బహుమతిని చెక్‌రూపంలో అందజేస్తున్న అతిథులు

కాకినాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీటీలో రెండు రోజులపాటూ నిర్వహించిన ప్రాంతీయ పాలీటెక్‌ఫెస్ట్ -2024 బుధవారం ముగిసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జనార్ధనరావు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ రహదారులు, భవనాలశాఖ ఎస్ఈ జి.కాంతు, గౌరవ అతిథిగా రాజమహేంద్రవరం జీఎమ్మార్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు పాల్గొన్నారన్నారు. కాంతు మాట్లాడుతూ జీవితంలో సానుకూల దృక్పథాన్ని అలవాటుచేసుకోవాలని, స్థితప్రజ్ఞత ప్రదర్శించాలని సూచించారు. సాంకేతిక విద్యా శాఖ, ఏపీప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 297 మంది తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు ప్రతీ ప్రాజెక్టును సందర్శించి మూల్యాంకనం చేశారు. ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు, సమీపంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సమారు 4000మంది ప్రదర్శనలను తిలకించారు. మొదటి 20 స్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన బీవీసీ విద్యార్థులు అనిల్‌బాబు, విష్ణుతేజల ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ప్రదర్శనకు రూ.25,000.. రెండోస్థానంలో నిలిచిన ఆదిత్య కళాశాల విద్యార్థుల ప్రదర్శనకు రూ.10,000 నగదు బహుమతులను చెక్‌రూపంలో అతిథుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తునిలో 'వైశ్యరాజు జ్యూయలర్స్' ప్రారంభం

తుని రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణంలోని పెంటకోట రోడ్డులో వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూమ్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి నిర్వాహకులతో కలిసి షోరూమ్‌ను ప్రారంభించి జ్యోతిప్రజ్వలన చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా సూర్యనారాయణ మొదటి బంగారు ఆభరణం కొనుగోలుతో అమ్మకాలను లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో తమ మొదటి షోరూమ్‌ను తునిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వినూత్నమైన కలెక్షన్ల ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను ఫ్లాట్ ఆరు శాతానికే విక్రయిస్తామన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, వినియోగదారుల తరపున జీఎస్టీ తామే చెల్లిస్తామన్నారు. కిలో వెండి వస్తువుల కొనుగోలుపై రూ.10వేలు వరకు తగ్గిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు, డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌లతో పాటు చెక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు కొనుగోలుదారులనుఆకట్టుకున్నాయి.


తునిలో వైశ్యరాజు జ్యూయలర్స్ ప్రారంభోత్సవం అనంతరం నిర్వాహకులు

ఘనంగా ఘంటసాల జయంతి


ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించిన చాగంటి కోటేశ్వరరావు, ఘంటసాల కోడలు కృష్ణకుమారి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాన గాంధర్వుడు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకొండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో ధర్మవర్ధిని ట్రస్ట్, శ్రీచాగంటి సత్సంగాల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి బ్రహ్మర్షిస్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వేల్యూస్ అడ్వైజరీ సభ్యులు డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు, ఘంటసాల కోడలు కృష్ణకుమారి, డాక్టర్ కే.వరప్రసాద రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఘంటసాలను ఉద్దేశించి చాగంటి ప్రసంగించారు. ఘంటసాల సన్నివేశాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత భావప్రకటనతో పాడేవారన్నారు. ఆణిముత్యాలు లాంటి ఎన్నో పాటలతో ప్రేక్షకులను రంజింపచేసిన గొప్ప గానగాంధర్వుడు ఘంటసాల అన్నారు. భలే మంచిరోజు, శిలలపై శిల్పాలు చెక్కినారు, హిమగిరి సొగసులు, మనసున మనసై, తెలుగువీర లేవరా వంటి ఎన్నో ప్రజాదరణ పొందిన పాటలు పాడారన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేస్తూ మృతి చెందిన పొట్టి శ్రీరాములు శవయాత్రలో పాల్గొని దేశభక్తి పాటలు పాడిన మహనీయుడన్నారు. అనంతరం ఘంటసాల గానంలో మానస పత్రులు హైదరాబాద్‌కు చెందిన గాయకులు శరచ్చంద్ర, చంద్రతేజ ఘంటసాల గాత్రంతో వినసొంపైన పాటలతో మైమరిపించారు. ఘంటసాల సంగీత విభావరి ఆకట్టుకుంది.

ధవళేశ్వరంలో...

ధవళేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరి కల్చరల్ అసోసియేషన్, రాకా సంస్థ సంయుక్తంగా పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ధవళేశ్వరం ఇరిగేషన్ పార్కులో గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బరాజు ఫౌండేషన్ డైరెక్టర్ గాలి సుబ్బరాజు మాట్లాడుతూ భగవద్గీతను శ్రావ్యంగా ఆలపించిన ఘంటసాల తెలుగు ప్రజల మనుస్సులో చిరస్థాయిగా నిలిచిన ధన్యజీవి అని కొనియాడారు. గోదావరి కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు జీవీ రమణ, సహ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ ఘంటసాలకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, రాజేశ్వరరావు, ఏపీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, వేగిశెట్టి కోదండ రామారావు, జీవీఆర్ జగన్నాథం, పీఎస్ శేషుకుమార్, బి.రామకృష్ణ, కేఎస్ గౌరీశంకర్, ఎం.రమేష్, గాదిరాజురామరాజు, గాయకుడు దేవకుమార్ ఘంటసాల విగ్రహానికి ఘన నివాళులర్పించారు.


ధవళేశ్వరంలో ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు






పాఠశాలలో పిల్లలకు ఆరోగ్య విషయాల కరపత్రాలు, పుస్తకాలు అందిస్తున్న పీవీవీ సత్యనారాయణ.. ముమ్మిడివరం భవిత కేంద్రంలో పిల్లలకు పండ్లు, బలవర్ధకమైన ఆహారం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

అందరూ హాయిగా ఉండాలి...

- 40 ఏళ్లుగా సేవా కార్యక్రమాల్లో ఓ మాస్టారు నిర్విరామ కృషి
- సొంత సొమ్ములతో ఆరోగ్య సూత్రాలపై ప్రచారం

(ఆంధ్రజ్యోతి/ముమ్మిడివరం)


కొవిడ్ సమయంలో పోషక విలువల కిట్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన, విశ్రాంత జీవనాన్ని గడిపేందుకు చాలామంది ఇష్టపడతారు. కానీ ఈయనకు విశ్రాంతి ఇష్టముండదు. అటు ఉద్యోగిగాను, ఇటు ఉద్యోగ విరమణ తరువాత కూడా సామాజిక సేవే లక్ష్యంగా జీవనం సాగిస్తున్నారు ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన పితాని వీర వెంకట సత్యనారాయణ. 37 ఏళ్లు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. అలాగే 1984 నుంచి సుమారు 40 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు 79 ఏళ్ల వయసులోనూ సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఎవరూ అనారోగ్యంపాలు కాకూడదనే ఆయన ఆశయం పాఠశాలలో చదువుకునే రోజుల్లోను, ఏజెన్సీలో ఉద్యోగాలు చేసే సమయంలో అనారోగ్యానికి పాలై తాను పడ్డ కష్టాల ఉంచి ఆయనకు ప్రేరణ కలిగింది. రోగాల బారిన పడి ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుని కష్టాలు పడే కంటే ఆరోగ్య సూత్రాలు పాటించడం ద్వారా రోగాలను పారదోలవచ్చుననేది ఆయన దృక్పథం. 2005 వరకు ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన సమయంలోను, రిటైర్డ్ అయిన తరువాత వచ్చే పెన్షన్ సొమ్ములో ఆయా సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తూ వస్తున్నారు. 'హాయిగా ఉండాలంటే' పేరిట 4460 ఆరోగ్య సూత్రాలతో కూడిన 2500 పుస్తకాలను ముద్రింపజేశారు. హాయిగా ఉండాలంటే 57 సూత్రాల కరపత్రాలను, దురలవాట్లకు దూరంగా ఉండండి, యోగాసనాలు వేస్తే రోగాలు పారిపోతాయి, సరదాగా సిగరెట్ కాలిస్తే, భయంకరమైన ఎయిడ్స్ వ్యాధి, మత్తు కోసం సారా తాగితే వంటి శీర్షికలతో 3 లక్షలకు పైగా కరపత్రాలు ముద్రించి బస్సులు, పాఠశాలల్లో సైన్స్‌ఫేర్, ట్రైనింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల సమావేశాల్లోను పంపిణీచేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యను ప్రోత్సహించాలనే సంకల్పంతో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. జడ్పీ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు మొదటి ఆరు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు, గ్రామర్ పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, తెలుగు, ఇంగ్లీషు డిక్షనరీలు, ఆరోగ్య సూత్రాల పుస్తకాలు అందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతిని కూడా అందిస్తున్నారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో, ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులకు, ముమ్మిడివరంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పండ్లు, బ్రెడ్డు వంటివి అందిస్తున్నారు. పాఠశాలలో యోగాసనాలువేసి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. పలు పాఠశాలలకు అవసరమైన వస్తు సామగ్రిని కూడా సమకూర్చారు. వీరవెంకటసత్యనారాయణకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో ఇద్దరు కుమారులు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. వారు కూడా తండ్రి చేసే సేవా కార్యక్రమాలకు కొంత ఆర్థిక సహకారం అందిస్తుంటారు. 1996 తుఫాను, 2006 వరదలకు నష్టపోయిన వారికి ఆర్థికసాయం అందించడంతోపాటు బియ్యం, దుస్తులు, వంట సామగ్రి వంటివి పంపిణీ చేశారు. 2019 కరోనా సమయంలో కోడిగుడ్లు, పండ్లు, నిమ్మకాయలు, వెల్లుల్లిపాయలు వంటి పోషక విలువల కిట్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. ముగ్గురు దివ్యాంగులకు నెలకు రూ.300 వంతున పింఛను అందిస్తున్నారు. మాస్టారు సేవా నిరతిని దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎం సీ బాలయోగి 2004లో తూర్పుగోదావరి కలెక్టర్‌గా పనిచేసిన కేఎస్ జవహర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు సత్కరించి పురస్కారాన్ని అందించారు.

వైభవంగా మహాయాగం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీరామ పాదకా పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం కాకినాడ జేఎన్‌టీయూకే ఎదురుగా గల ప్రాంగణంలో శ్రీరామ సేవాసమితి, వికాస తరంగిణి, శ్రీవారాహీ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విశ్వశాంతి శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగంలో భాగంగా వైభవంగా మహాయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అగ్ని ప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన, శాంతిపాఠం, వేదాదివిన్నపాలు, శ్రీ విష్వక్సేన సంతాన హోమాన్ని పలు రకాల విశేష ద్రవ్యాలతో వైభవంగా నిర్వహించారు. విశ్వశాంతిని కోరుకుందామంటూ చినజీయర్‌స్వామి అనుగ్రహ పారాయణచేశారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. రాధికా ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి ఆకట్టుకుంది.


మహాయాగంలో పాల్గొన్న చినజీయర్ స్వామి

శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో..

3 రోజులపాటు అంతరాలయ దర్శనాల నిలిపివేత

17,18,19 తేదీల్లో మరమ్మతులు

పిఠాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో ఈనెల 17,18,19వ తేదిల్లో అంతరాలయం, పాదుక, త్రిమూర్తుల(శ్రీపాద వల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి) దర్శనాలను నిలిపివేయనున్నారు. అంతరాలయం మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. ఈ 3రోజులు శ్రీపాదశ్రీవల్లభ స్వామి ఉత్సవమూర్తులకు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. మహాసంస్థానానికి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

7న ఉమ్మడి జిల్లా, కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం సమావేశం

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా, కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం సమావేశం ఈనెల 7వతేదీ శనివారం సాయంత్రం 4గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు వెనుక వెంకటరత్నపురంలోని గాంధీ భవన్‌లో సంస్థ అధ్యక్షుడు వైడీ రామారావు అధ్యక్షతన జరగనుంది. రైల్వేలు, రోడ్డు ప్రయాణికుల సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశంలో సంఘ సభ్యులతో పాటు ఆసక్తి కలిగిన ప్రజలు అందరూ పాల్గొనాలన్నారు.

ప్రజలపై 'సైబర్' వల

- కాకినాడ జిల్లా శంఖవరంలో కాంట్రాక్టర్‌కు టోకరా
- తక్కువ రేటుకు సిమెంట్ అమ్మకం అని నమ్మబలికి రూ.5లక్షల20వేల నగదు వేయించుకుని.. ఫోన్ ఆఫ్
- అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు

శంఖవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ అత్యాశను ఆసరాగా తీసుకుని ఓ సైబర్ నేరగాడు మోసం చేశారు. కాకినాడ జిల్లా శంఖవరానికి చెందిన కాంట్రాక్టర్ ఖాతా నుంచి ఏకంగా రూ.5లక్షల20వేలు కాజేశాడు. దీనిపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అన్నవరం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శంఖవరం గ్రామానికి చెందిన వెన్నా వీరవెంకట సత్యనారాయణ సివిల్ కాంట్రాక్టరుగా రోడ్డు పనులు నిర్వహిస్తుంటాడు. సిమెంట్ తక్కువ ధరకు ఎక్కడ లభ్యమవుతుందోనని ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఇది గమనించిన సైబర్ నేరగాడు అతడికి వలవేశాడు. తక్కువ రేటుకే సిమెంట్ ఇస్తానని నమ్మబలికాడు. డబ్బులు బదిలీ చేసి చిరునామా పంపిస్తే వెంటనే డెలివరీ ప్రాసెస్ మొదలవుతుందని చెప్పాడు. అలా ఆన్‌లైన్‌లో ఉండగానే రూ.5లక్షల20వేలు బదిలీ చేయించుకున్నాడు. నగదు బదిలీ అవగానే ఫోన్ కట్ అయింది. మళ్లీ ఆ నెంబరుకు చేస్తుంటే అందుబాటులో లేదని వచ్చింది. దీంతో కాంట్రాక్టర్ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, నగదు బదిలీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తెలిపారు.

అల్లవరం మండలంలో వరుసగా సైబర్ మోసాలు


అల్లవరంలో సీబీఐ అధికారిని అంటూ వాట్సాప్ కాల్‌లోకి వచ్చి మోసగించిన వ్యక్తి చిత్రం

- సీబీఐ అధికారిని అని బెదిరించి డబ్బులు వసూలు
- రూ.85వేలు నష్టపోయిన ఓ ఉపాధ్యాయురాలు
- మరో ఇద్దరికీ బెదిరింపు కాల్స్

అల్లవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో ఐదురోజులుగా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. సీబీఐ అధికారిని అని వీడియో కాల్ ద్వారా బెదిరించి ఓ ఉపాధ్యాయురాలి నుంచి ఏకంగా రూ.85వేలు కాజేశారు. మరో ఇద్దరికి ఫోన్ చేసి డబ్బులు లాగే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. రెండురోజుల క్రితం ఇదే మండలంలోని దేవగుప్తం గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలికి ఫోన్ చేసి మీ కుమారుడు గంజాయి కేసులో అరెస్టు అయ్యాడని రూ.లక్ష ఫోన్‌పే చేయాలని బెదిరించగా ఆమె రూ.85వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించి మోసపోయింది. ఇదే గ్రామంలో కిరాణా వ్యాపారి చిట్టూరి రామకృష్ణకు కూడా ఫోన్ చేసి మీ వీడియోలు మా దగ్గర ఉన్నాయి. అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశాం రమ్మని బెదిరించారు. బుధవారం వాసర్ల లక్ష్మణరావు అనే వ్యక్తికి ఫోన్ చేసి మీ అబ్బాయిని అరెస్టు చేస్తామని బెదిరించగా సదరు వ్యక్తి గట్టిగా సమాధానం చెప్పడంతో లైన్ కట్ చేశాడు. సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జి.హరీష్ కుమార్ చెప్పారు. ఇలాంటి కాల్స్‌వస్తే నెంబర్లు సేకరించి స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సింగ్ పేరుతో సీబీఐ అధికారి అని బెదిరించిన వ్యక్తి ఫొటోలను బాధితులు సేకరించారు.


భూ ప్రకంపనలు



తెలంగాణలోని ములుగు కేంద్రంగా వచ్చిన భూకంప కేంద్రం

- తెలంగాణ రాష్ట్రం ములుగు కేంద్రంగా స్వల్ప భూకంపం
- ఏజెన్సీలోని విలీన మండలాల్లోను భూ ప్రకంపనల ప్రభావం
- ఉలిక్కి పడిన ప్రజలు
- కూనవరంలో పగిలిన ఇంటి గోడలు
- వీఆర్‌పురంలోను గోడకు బీటలు

కూనవరం/చింతూరు/ఎటపాక, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ములుగు కేంద్రంగా వచ్చిన భూకంపం ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాల్లో పలుచోట్ల భూప్రకంపనలు కనిపించాయి. కూనవరం మండలంలో బుధవారం స్వల్పంగా భూమి కంపించింది. సరిగ్గా ఉదయం 7.20-7.30 గంటల మధ్య భూప్రకంపనలు రావడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రెండుసెకన్ల పాటు ఈ భూకంపం వచ్చింది. దీంతో మండలంలో టేకులబోరు గ్రామానికి చెందిన బండారు సాయికుమార్ ఇంటి గోడలు బీటలు వారాయి. కూనవరంలోని కాశీ అనే వ్యక్తి ఇంట్లో కొబ్బరిచెట్టుకు ఉన్న ఎండిపోయిన కొబ్బరిబొండాలు ఒక్కసారిగా నేలరాలాయి. చింతూరు, ఎటపాకల్లోను బుధవారం ఉదయం 7.27 గంటలకు రెండు, మూడు సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ఈ ప్రాంతవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భూకంపానికి ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు.


కూనవరం మండలం టేకులబోరులో భూకంపానికి బీటలు వారిన ఇంటిగోడలు


రేఖపల్లిలోని ఓ ఇంట్లో బీటలు వారిన గోడ

వీఆర్‌పురంలో స్వల్ప భూకంపం

వీఆర్‌పురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీఆర్‌పురం, వడ్డిగూడెం, రేఖపల్లి గ్రామాల్లో స్వల్ప భూకంపం వచ్చింది. బుధవారం ఉదయం 7.25 గంటల సమయంలో స్వల్ప భూకంపం రావడంతో రేఖపల్లి ఆర్‌ఎంపీ వైద్యుడు నాగేంద్రబాబు ఇంట్లో కొద్దిగా శబ్దం రావడంతో భయాందోళన చెందారు. ఆ తర్వాత చూస్తే ఇంట్లో గోడలు స్వల్పంగా బీటలు వారాయి. వీఆర్‌పురంలోని పిట్టా వెంకన్న(వీఆర్‌వో) మంచంపై కూర్చున్న సమయంలో ఆ మంచం కదలడం, వడ్డిగూడెంలోను కుర్చీలు బల్లలు, ఇంట్లోని సామాన్లు రెండు, మూడు సెకన్లు కదిలాయని వారు తెలిపారు. దీంతో స్థానికులు భూకంపం వచ్చిందని భయాందోళన చెందారు.

గోకవరంలోను స్వల్పంగా..

గోకవరం, డిసెంబరు 4: గోకవరంలోను బుధవారం ఉదయం స్వల్ప భూప్రకంపన సంభవించినట్లు స్థానికులు చెప్తున్నారు. ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో ఉదయం 7.30 గంటల సమయంలో మూడు సెకన్ల పాటు భూమి కంపించిందని, ఆ సమయంలో ఇంట్లోని వస్తువులు ఊగిసలాడడంతో తామంతా ఆశ్చర్యానికి గురయ్యామని, ఆ తర్వాత ఆందోళన చెందామని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని పలువురు సోషల్ మీడియా ద్వారా తమ పంచుకున్నారు.

కాకినాడలో నేటి నుంచి.. ప్లాస్టిక్ సర్జరీపై సదస్సు

- మూడురోజులపాటు సెమినార్లు.. వైద్యవిదార్థులకు అవగాహన తరగతులు
- హాజరుకానున్న దేశవ్యాప్త ప్లాస్టిక్, ఈస్తటిక్, కాస్మోటిక్ వైద్యనిపుణులు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ రీకనస్ట్రక్టివ్ అండ్ సర్జన్ ఆఫ్ ఏపీ, తెలంగాణా ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7వ తేదీల్లో మూడురోజులపాటు కాకినాడ జీజీహెచ్‌లో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ డాక్టర్ డీవీ కృష్ణారావు, సెక్రటరీ డాక్టర్ రత్నభూషణ్ తెలిపారు. ప్లాసిక్ సర్జరీ, ఈస్తటిక్, కాస్మోటిక్ సర్జరీల ప్రాముఖ్యత సమాజంలో ఎంతో ఉందో తెలియజేయడం ఈ సెమినార్ల ముఖ్య ఉద్దేశమన్నారు. జీజీహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో దేశంలో ఉన్న ప్రముఖ ప్లాస్టిక్, ఈస్తటిక్, కాస్మోటిక్ వైద్యనిపుణుల ఆధ్వర్యంలో వైద్యవిద్యార్థులు, పీజీలకు గురువారం అవగాహన కల్పిస్తారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలు, అల్సర్ పుండ్లు లోపల సరిచేసేందుకు ప్లాస్టిక్ సర్జరీ, మారిన ప్రజల అభిరుచులు, జీవనశైలితో బాహ్య సౌందర్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖంపై ముడతలు, అందంతో ఈస్తటిక్, కాస్మోటిక్ సర్జరీలపై ప్రదర్శనాత్మకంగా మృతి చెందిన శరీరాలను ఉపయోగించి అవగాహన కల్పిస్తారన్నారు. 5న జీజీహెచ్‌లో, 6, 7వ తేదీల్లో కాకినాడ కుళాయిచెరువు రాజాట్యాంకులోని పేబిన్ కన్వెన్షన్ హాల్లో ఈ సెమినారు నిర్వహిస్తారన్నారు. ఈ సెమినార్‌లో పాల్గొనేందుకు రీసోర్సుపర్సన్లుగా దేశంలోని ప్లాస్టిక్, ఈస్తటిక్, కాస్మోటిక్ రంగాల్లో నిష్ణాతులైన వైద్యనిపుణులు పూణె, కోల్‌కత్తా, హైదరాబాద్, ముంబాయి, ఢిల్లీ, నాగపూర్, కర్నాటక, తమిళనాడునుంచి విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఉస్మానియా వైద్యనిపుణులు సీనియర్ డాక్టర్ డాక్టర్ వెంకటరాఘవరెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి విచ్చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శశి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ డీవీ కృష్ణారావు

స్టేట్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లకు యువకుడి ఎంపిక


పడాల వంశీనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): 2024-25 సీజన్‌లో అండర్-23 పురుషుల ఇంటర్ స్టేట్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరానికి చెందిన పడాల వంశీనారాయణ ఎంపికయ్యాడు. అండర్-23 పురుషుల ఇంటర్ స్టేట్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు ప్రాతినిధ్యం వహించడానికి ఈనెల 2న వైజాగ్‌లో ఐదుగురు సభ్యులతో టీమ్ ఎంపికలు నిర్వహించారు. ఏపీ జట్టుకు 17మందిని ఎంపిక చేయగా వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి వంశీనారాయణ ఒకరు. ఈనెల 13 నుంచి జార్ఖండ్‌లో జరగనున్న ఇంటర్ స్టేట్ వన్డే క్రికెట్ మ్యాచ్‌ల్లో అతడు పాల్గొనే అవకాశం ఉంది. ఈ సందర్భంగా వంశీనారాయణకు తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, నాగలక్ష్మిలతోపాటు తూర్పుగోదావరి క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, రఫీ, కోనసీమ క్రికెట్ కోచ్‌లు సత్తిబాబు, నగేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడి అరెస్ట్

పి.గన్నవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక ప్రాథమిక పాఠశాలవద్ద విద్యార్థులపై లైగింక వేధింపులకు పాల్పడ్డ కీచక ఉపాధ్యాయుడు పిండి శ్రీనివాస్‌కు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఘటనలో ఉపాధ్యాయుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారయత్నం మూడు సెక్షన్లు కింద ఏఎస్‌ఐ పట్టాభిరామయ్య కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. డీఎస్పీ వైగోవిందరావు విచారణ నిర్వహించి ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారన్నారు. కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని, దర్యాప్తు కొనసాగుతుందని ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఆర్టీసీ డ్రైవర్ లోవరాజు

- దేవర సినిమా పాటకు డ్యాన్స్ వేసి సస్పెండ్ అయిన డ్రైవర్
- మంత్రి చొరవతో సస్పెన్షన్ రద్దు
- కుటుంబంతో సహా మంత్రిని కలిసి కృతజ్ఞతలు

తుని రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను తుని ఆర్టీసీ డిపోకు చెందిన బస్ డ్రైవర్ లోవరాజు మంగళగిరి క్యాంపు కార్యాయంలో బుధవారం కలిశారు. ఇటీవల దేవర సినిమాపాటకు బస్సు ముందు డ్యాన్స్ వేసి ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం.. తదనంతరం డిపో అధికారులు డ్రైవర్‌ను సస్పెండ్ చేయడం తెలిసిందే. మంత్రి లోకేశ్ చొరవతో సస్పెన్షన్ రద్దు చేయగా అతడు యథావిధిగా ఉద్యోగంలో చేరాడు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ స్వయంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి డ్రైవర్ టాలెంట్‌పై ప్రశంసలు కురిపించారు. దీంతో లోవరాజు కుటుంబసభ్యులతో కలిసి మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అతడు ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న డ్రైవర్ల గోడు తెలిపాడు. తమ కుటుంబం ఆర్థికంగా వెనుకబడినదని, సొంత ఇల్లు కూడా లేదని మంత్రికి చెప్పాడు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందిస్తూ డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటామని, సొంతిళ్ల ఏర్పాటుకు చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. డ్రైవర్ వెంట తొండంగి మండలం ఒంటిమామిడి సర్పంచ్ అంగుళూరి సుధాకర్ ఉన్నారు.


మంత్రి లోకేశ్‌తో ఆర్టీసీ డ్రైవర్ లోవరాజు, అతని కుటుంబసభ్యులు

కోళ్లఫారంలో 1836 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఉండ్రాజవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో కోళ్లఫారంలో బుధవారం రేషన్‌బియ్యం నిల్వలు గుర్తించి సీజ్ చేసినట్టు కొవ్వూరు డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లయిస్ అధికారి ఎం.నాగాంజనేయులు తెలిపారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు వేలివెన్ను గ్రామం మునిపల్లి రోడ్డులో ఉన్న జోగిరాజు కోళ్ల ఫారంలో తనిఖీలు చేయగా 34 ప్లాస్టిక్ బ్యాగ్‌లలో 1836 కేజీల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. వీటి విలువ రూ.79,866 ఉంటుందన్నారు. కోళ్లఫారం యజమాని మంతెన సుబ్బారావుపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈతనిఖీల్లో ఉండ్రాజవరం సీఎస్ డీటీ సుధీర్, వీఆర్వోలు మురళి, ఏసుపాదం, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.


వేలివెన్నులో రేషన్‌బియ్యం పట్టుకున్న అధికారులు

ఉరివేసుకుని ఒడిశా యువకుడి ఆత్మహత్య


ఫ్యాన్‌కు ఉరివేసుకున్న ఒడిశా యువకుడు

కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒకసారి ఉరివేసుకుంటుంటే తోటి సిబ్బంది ఆపడంతో వారి దృష్టిమరల్చి రెండోసారి ఉరేసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దేచర్లలోని త్రివేణి ఫ్యాక్టరీలో ఒడిశా రాష్ట్రం కాంతిమిల్లి దినకన్షై జిల్లా బాదముండా కాంతిమిలి గ్రామానికి చెందిన చందన్ బెహెరా(19) వంట మాస్టర్‌కి అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కొవ్వూరు రాధాకృష్ణ హైస్కూల్ సమీపంలోని ఓ అపార్టుమెంటులో నివాసం ఉంటున్నాడు. చందన్ బెహెరాతోపాటు అపార్టుమెంట్‌లో అసిస్టెంట్ దుష్యంతు, ఒక ఆడిటర్ ఉంటున్నారు. మాస్టర్ చెఫ్ మూడు రోజుల కిందట ఊరు వెళ్లాడు. చందన్ బెహెరా మూడురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈనెల 3వతేదీ అర్ధరాత్రి హాలులో ఉన్న ఫ్యాన్‌కు అతడు ఉరివేసుకోవడానికి ప్రయత్నించగా దుష్యంతు, ఆడిటర్ చూసి ఆపి అతడిని సముదాయించారు. దీంతో అతడు పక్కగదిలోకి వెళ్లి పడుకుంటానని తలుపులు వేసుకున్నాడు. మిగిలిన ఇద్దరు మరో రూమ్‌లో పడుకున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు తలుపులు కొట్టగా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి తలుపులు తెరవగా రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు దుప్పటితో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. త్రివేణి రేణుబుల్స్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ మేనేజర్ సంతోష్ సాహు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.

'పెందుర్తి'కి కేబినెట్ హోదా


వెంకటేష్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- తొలిసారిగా రాజానగరానికి కేబినెట్ ర్యాంకు
- సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఉన్న పెందుర్తి వెంకటేశ్
- ఆనందోత్సాహాల్లో టీడీపీ శ్రేణులు

రాజానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శాసనసభా నియోజకవర్గాల పునర్విభజన అనంతరం దశాబ్దంన్నర కాలం తర్వాత రాజానగరం నియోజకవర్గానికి తొలిసారి కేబినెట్ హోదా లభించింది. టీడీపీకి కంచుకోటగా ముద్రపడ్డ రాజానగరం నియోజకవర్గానికి కూటమి ప్రభుత్వ హయాంలో ఈ హోదా లభించడంతో పార్టీశ్రేణుల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. సీఎం చంద్రబాబు కార్యక్రమ నిర్వహణ కోఆర్డినేటర్‌గా ఉన్న రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు ప్రభుత్వం కేబినెట్ హోదా ర్యాంకు కల్పించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. సీఎం చంద్రబాబు కార్యక్రమాలను పెందుర్తి పర్యవేక్షిస్తారు. ఎన్నికల ముందు నుంచి ఆయన ఈ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరానికి చెందిన పెందుర్తి వెంకటేష్ సతీమణి అన్నపూర్ణ అప్పటి బూరుగుపూడి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. ఆ తర్వాత పార్టీతోనే కలిసి నడిచారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజనతో ఏర్పడ్డ రాజానగరం నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు 2009, 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019 ఎన్నికల అనంతరం దాదాపు మూడేళ్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగిన పెందుర్తి పార్టీ అంతర్గత వ్యవహారాలతో మనస్తాపం చెంది ఆ పదవి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. అయినా చంద్రబాబు జిల్లా పర్యటనలకు వచ్చిన ప్రతిసారి అధినేత వెంట నడిచారు. ప్రస్తుత రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిని టీడీపీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా అధిష్ఠానం నియమించడంలో వెంకటేష్ కీలకంగా వ్యహరించారు. అనంతరం రాజానగరం నియోజకవర్గంలో పర్యటించిన బీవీఆర్ చౌదరి నియోజకవర్గంలో పెందుర్తి పట్టుసడల్లేదని అధిష్ఠానానికి నివేదించినట్టు తెలిసింది. ఇక 2024 ఎన్నికల సమయంలో పొత్తు కారణంగా రాజానగరం నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో బత్తుల బలరామకృష్ణ అభ్యర్థి అయ్యారు. ఆయన విజయం సాధించడంలో బీవీఆర్ చౌదరి, పెందుర్తి అహర్నిశలు శ్రమించారు. పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న వెంకటేష్‌ను గుర్తించి ఎన్నికలకు ముందే తన పర్యటన కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్న పెందుర్తికి కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పార్టీశ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పార్టీ పరంగా కేబినెట్ ర్యాంకు లభించిన మొట్టమొదటి వ్యక్తిగా వెంకటేష్ నిలిచారు. ఈ సందర్భంగా ఆయన్ను టీడీపీ మండల నాయకులు దాసరి శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఖండవిల్లి లక్ష్మి, నాయకులు మల్లారపు సత్యానందం, మింగి లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కె.శామ్యూల్ కలిసి అభినందించారు.

రాజానగరానికి మూడు పదవులు

కూటమి ప్రభుత్వం రాజానగరం నియోజకవర్గంపై ప్రధాన దృష్టి కేంద్రీకరించింది. ఇప్పటికే మూడు పదవులు నియోజకవర్గాన్ని వరించాయి. సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన మునికోటేశ్వరరావును టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. ఇటీవల రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరిని రుడా చైర్మన్‌గా ఎంపిక చేశారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు కేబినెట్ హోదా కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

గూడపల్లి సీఈవో ఆత్మహత్యాయత్నం

- జీతాల చెల్లింపులో ఆలస్యం, పని ఒత్తిడి కారణం అంటున్నారన్న ఎస్‌ఐ


చికిత్స పొందుతున్న సత్యనారాయణ

మలికిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లి ప్రాథమిక సహకార సంఘం సీఈవోగా పనిచేస్తున్న నూకల వీరవెంకటసత్యనారాయణ బుధవారం తన ఇంట్లో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్లు మలికిపురం ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని, మూడు నెలలుగా జీతాలు లేకపోవడం, కార్యాలయంలో పని ఒత్తిడి పెరగడం వల్ల మాత్రలు మింగినట్లు తెలిపారని ఆయన చెప్పారు. రాజోలు డీసీసీబీ పరిధిలోకి వచ్చే గూడపల్లి పీఏసీఎస్‌కు మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతోపాటు డీసీసీబీ మేనేజర్ ఒత్తిడితో కంప్యూటరైజేషన్ పేరుతో పనిఒత్తిడి పెంచి మానసికంగా వేధిస్తున్నారని బాధితుడు సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడిని పలువురు సీఈవోలు, సిబ్బంది పరామర్శించారు. సత్యనారాయణ భార్య, కుమారుడు కూడా గతంలో మృతి చెందినట్లు తెలిసింది. గూడపల్లి సొసైటీ కంప్యూటరైజేషన్‌లో వెనుకబడి ఉందని, రికార్డులు సక్రమంగా లేవని, సెప్టెంబరు నెలలో జీతాలు తీసుకున్నారని, అక్టోబరు నెల జీతం మాత్రమే రావాల్సి ఉన్నట్లు కొందరు తెలిపారు. రైతులకు ఇచ్చే రుణాలపై కట్టే వడ్డీ నిధుల నుంచే జీతాలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్లు నిబంధన పెట్టడంతో సీఈవోలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది.

మూడోసారీ.. నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- నిధులపై స్పష్టత కరువు
- అందుకేనా వాయిదా?

సామర్లకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారులు సంఘాల ఎన్నికలు మూడోసారి వాయిదా వేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆయా పదవులకు పోటీలో ఉండామని ఉవ్విళ్లూరిన కూటమి పార్టీల నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్టుగా ప్రభుత్వం ఆదేశాలు మారాయి. ముందుగా నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం ఈనెల 5న గురువారం ఎన్నికలకు స్థానికంగా అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి 8న డబ్ల్యూయూఏలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఆ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని మంగళవారం రాత్రి ప్రభుత్వం నుంచి కలెక్టర్ కార్యాలయానికి మౌఖికంగా సమాచారం అందగా ఉత్తర్వులు బుధవారం నాటికి అందాయి. దీంతో ఇప్పటివరకూ చేసిన ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా ఆపేశారు. కాగా కూటమి వచ్చి నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించాక ఇలా వాయిదా పడడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తొలుత ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఇచ్చినపుడు వరదలు, భారీవర్షాల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. రెండోసారి షెడ్యూల్ ఇచ్చినపుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన ఈ ఎన్నికలపై ఎమ్మెల్యేల దృష్టి సారించే అవకాశాలు ఉండవని భావించి వాయిదా వేశారు. మూడోసారి షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ నెల 5న నోటిఫికేషన్ ఇవ్వాల్సిఉండగా మరోసారి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయాక జిల్లా అధికారులకు అమరావతి నుంచి సమాచారం అందించారు. మూడోసారి ఈ ఎన్నికలను ఎందుకు వాయిదా వేశారో అధికారులకే కాదు.. నాయకులకు సైతం అర్థంకాక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

అధికారులకు తప్పిన భారం

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ జలవనరులశాఖ అధికారులకు సమస్యగా మారింది. నోటిఫికేషన్ దశకు వచ్చేవరకూ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వంనుంచి విడుదలకాక అధికారులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. స్థానికంగా జలవనరుల శాఖ పరిధిలో నిధులు అందుబాటులో లేవు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ ఎలా అనేది అర్థంకాక సతమతమవు తున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు అందిన సమాచారంతో అధికారులు ఊపిరి తీసుకున్నారు. ఈ ఎన్నికలను రెవెన్యూ, జలవనరుల శాఖలకు చెందిన అధికారుల భాగస్వామ్యంతో నిర్వహించాలి. సాగునీటి సంఘాలు, వాటి పరిధిలోని నీటివనరులు, ఆస్తులు అన్నీ జలవనరుల శాఖకు చెందినవే కాగా కేవలం ఎన్నికల ప్రక్రియ వరకే రెవెన్యూశాఖ భాగస్వామ్యం ఉంటుంది. దీంతో ఆ ప్రక్రియ అంతా జలవనరుల శాఖ అధికారులే చూడాల్సి ఉంది. నిధులు అందుబాటులో లేకపోవడమేకాక సిబ్బంది కొరత ఉండడంతో ఆ శాఖ అధికారులు ఆందోళన చెందారు. దీంతో వాయిదాతో తాత్కాలికంగా వారికి ఊరట కలిగింది. ఎన్నికలు వాయిదా వేసే వరకూ నిధుల విడుదల ఊసెత్తి లేకపోవడం గమనార్హం.

ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. కొనుకు నాగరాజు, జాలెం శ్రీనివాసరాజా, తుండూరి బుజ్జి, మందా గాంధీ పరామర్శించారు.

పొలం పిలుస్తోంది

అంతర్వేది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది, అంతర్వేది దేవస్థానం గ్రామంలో వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. కల్యాణ్, రవితేజ, ఇరు గ్రామాల గ్రామస్తులు పాల్గొన్నారు.

మిల్లుల కేటాయింపులో అన్యాయంపై రైస్‌మిల్లర్స్ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కస్టమ్ మిల్లెడ్ రైస్‌మిల్లుల యజమానులు

అమలాపురంటౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల అవగాహన రాహిత్యం వల్ల మిల్లుల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ జనసేన పార్టీకి చెందిన కోనసీమ రైస్ మిల్లర్లు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత పదేళ్ల కాలంలో కస్టమ్ మిల్లెడ్ రైస్ (సీఎంఆర్)పై ఆధారపడి బతుకుతున్నామన్నారు. స్థానికంగా పండిన ధాన్యానికి తొలి ప్రాధాన్యం కోనసీమ ప్రాంత మిల్లర్లకు అధికారులు కేటాయించే వారని వివరించారు. ఏటా డెలివరీని బట్టి టార్గెట్‌ను కేటాయించి మిల్లులకు ధాన్యాన్ని తరలించేవారని తెలిపారు. అందుకు భిన్నంగా కోనసీమ జిల్లాలో కెపాసిటీని ఆధారంగా చేసుకుని టార్గెట్లు ఇస్తున్నారని విమర్శించారు. స్థానికంగా పండించిన ధాన్యం స్థానిక మిల్లులకు చేరకుండా ఎక్కడో దూరంగా ఉన్న మిల్లులకు తరలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు గ్యారంటీలు తీసుకుని మిల్లులు నడుపుతున్నామని, మిల్లుల వద్ద పనులు లేక కూలీలు ఖాళీగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోనసీమ ప్రాంత మిల్లులకు సీఎంఆర్ కేటాయింపులో అన్యాయం జరిగిందని, అందుకు గల కారణాలు గుర్తించి స్థానిక మిల్లుల యజమానులకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. సీఎంఆర్‌మిల్లుల అసోసియేషన్ ప్రతినిధులు ఇందుగుల శివరామకృష్ణ, దివ్వి శ్రీనివాసరావు, సత్తి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కోనసీమ ప్రాంత మిల్లుల యజమానులు పడుతున్న అవస్థలను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళతామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి శ్రేష్ఠమైనది : డీఈవో

● ఉపాధ్యాయుడా మేలుకో కార్యక్రమం ప్రారంభం



ఉపాధ్యాయుడా మేలుకో కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

మామిడికుదురు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యంత శ్రేష్ఠమైనదని జిల్లా విద్యాశాధికారి ఎస్‌కే సలీంబాషా పేర్కొన్నారు. ఉపాధ్యాయుడా మేలుకో అనే కార్యక్రమాన్ని మామిడికుదురు మండలం నుంచి బుధవారం డీఈవో ప్రారంభించారు. ఈసందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిపూర్ణమైన సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే శ్రామికుడు ఉపాధ్యాయుడని, అటువంటి ఉపాధ్యాయ వృత్తికి కళంకం తీసుకురావద్దని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అసభ్యకరంగా ప్రవర్తించి కుటుంబం తల దించుకునే పరిస్థితి తీసుకువస్తున్నారని, అటువంటి పరిస్థితులు రాకుండా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల్లో మార్పు రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు రామాయణ, మహాభారత ఇతిహాసాలు, విజయగాథలు వివరించాలని తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయులపై పోక్సో కేసులు నమోదవ్వడం విచారకరమని, దాని దృష్ట్యా ఉపాధ్యాయుడా మేలుకో కార్యక్రమానికి జిల్లాలో శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రతీ ఒక్కరూ వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేసి వృత్తికి మంచిపేరు తీసుకురావాలన్నారు. నాలుగు గోడల మధ్య ఉన్నాం, చేసేది ఎవరు చూడడంలేదని అనుకోవద్దని ఉపాధ్యాయులను ఉద్దేశించి చురకలు వేశారు. పలు అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఎంఏకే భీమారావు, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవో నంబరు 110పై ఆరోపణలు తగవు



అప్పనపల్లిలో నిరసన తెలియచేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

మామిడికుదురు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి శ్రీబాలబాలాజీ దేవస్థాన కేశఖండనశాలలో జీవో నంబరు 110 ప్రకారం విధుల్లోకి తీసుకున్న ఉద్యోగులపై ఆరోపణలు తగవని అప్పనపల్లి బాలబాలాజీ నాయీబ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు పేర్కొన్నారు. జీవో నంబరు 10 ప్రకారం గతంలో 37మందిని ఉద్యోగులుగా పరిగణించాలని, కానీ దేవస్థానం ఆర్థిక పరిస్థితిని బట్టి 24మందికి ఆర్డర్ వచ్చిందన్నారు. విధులకు సరిగా హాజరు కాని 13మందిని తొలగించి వారికి న్యాయం చేసే విధంగా అప్పట్లో 24మంది సభ్యులకు వచ్చిన వేతనాన్ని 37మంది సభ్యులు పంచుకునే విధంగా నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. కానీ విధులకు హాజరుకాని 13 మందిలో పది మంది తమకు కమీషన్ కావాలని, జీతం వద్దనే విధంగా హైకోర్టులో తప్పుడు పిటిషన్‌వేసి తమను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. జీవో నంబరు 110పై ఇటీవల ఆ పది మంది సభ్యులు వివిధ రకాల వ్యాఖ్యలు చేస్తున్నారని, అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దీనిని కులసంఘ పెద్దలు, నాయకులు గమనించాలని నిరసన తెలిపారు. సంఘ అధ్యక్షుడు ఆర్వీఎస్ఎస్ ప్రసాద్,సెక్రటరీ పీవీ దుర్గారావు, రామేశ్వరపు వెంకటరమణమూర్తి, కాజులూరి సత్యనారాయణ, గూడపల్లి రాజారమేష్, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

అల్లవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఈనెల1న వృత్తిరీత్యా బట్టలు ఉతకడానికి వెళ్లిన తన భర్త పెదపూడి ఏసుబాబు(48) బోడసకుర్రు పంచాయతీ సమీపంలోని కమ్మర చెరువులో మృతిచెంది ఉన్నాడని గ్రామానికి చెందిన లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

239 మద్యం సీసాలు స్వాధీనం

పి.గన్నవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లోని బాలాజీ వైన్స్ వెనుక ఉన్న బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించినట్లు కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. 239సీసాలను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు మట్టపర్తి ఫణి కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భవానీల 18 కలశల పూజ



పద్దెనిమిది కలశల భవానీల పూజా కార్యక్రమంలో భాగంగా సముద్రం పక్కన పూజలందుకుంటున్న అమ్మవారు

అంతర్వేది, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో బెల్లంకొండవారి దిండకొడప వద్ద భవానీల పద్దెనిమిది కలశాల పూజా కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ముగ్గురమ్మల మూలశక్తి భవానీల పీఠం ఆధ్వర్యంలో భవానీలు కలశాలతో గ్రామోత్సవం నిర్వహించి సముద్ర స్నానం ఆచరించిన అనంతరం ఒడ్డున అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం మంగళంపల్లి పవన్ గురువు ఆధ్వర్యంలో పద్దెనిమిది కలశాల పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సఖినేటిపల్లి మండలంతో పాటు ఇతర మండలాల నుంచి భవానీ మాలధారణ భక్తులు పద్దెనిమిది కలశాల పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వాములు, శివస్వాములు కూడా పూజల్లో పాల్గొన్నారు. శ్రీజ్యోతిస్వరూప అయ్యప్ప భజన సమాజం ఆధ్వర్యంలో భజనా కాలక్షేపాలు నిర్వహించారు. భవానీలు భక్తిశ్రద్ధలతో పద్దెనిమిది కలశాల పూజా కార్యక్రమంలో భాగంగా పడి తొక్కి అమ్మవారి శక్తి స్వరూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

అక్రమ వసూళ్లపై విచారణ

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది నుంచి ముమ్మిడివరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వైద్య శాఖ వాట్సాప్ గ్రూపులో హల్‌చల్ చేయడంపై బుధవారం విచారణ అధికారిగా నియమితులైన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ, డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొర బుధవారం జిల్లాలోని వైద్యుల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదులు స్వీకరించారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తోన్న సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీధర్, మరికొంత మంది సిబ్బంది వైద్యుల నుంచి లీవ్‌ల మంజూరు, సరండర్ లీవ్‌లు, మెడికల్ రియంబర్స్‌మెంట్ వంటి మంజూరులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు వాట్సాప్ గ్రూపులో హల్‌చల్ చేయడంతో గత నెల30న డీఎంఅండ్‌హెచ్ దుర్గారావుదొర ప్రాథమికంగా విచారణ నిర్వహించి, రీజనల్ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు విషయాన్ని నివేదించిన విషయం విదితమే. దీనిపై విచారణ అధికారిగా వీవీవీ సత్యనారాయణను నియమించారు. డీఎంఅండ్‌హెచ్‌వో, విచారణాధికారి సత్యనారాయణ బుధవారం జిల్లాలోని 18మంది వైద్యుల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదులు స్వీకరించినట్టు తెలిసింది. దీనిపై వైద్యులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మంది కార్యాలయ ఉద్యోగులను విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు.

నేలనంటిన పైరు.. మొలకెత్తుతున్న ధాన్యం



కాట్రేనికోనలో నేలనంటిన సార్వాపైరు

కాట్రేనికోన, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను మండలంలోని రైతులకు కన్నీరు మిగిల్చింది. కోతకొచ్చిన సార్వా పైరు నేలనంటి రైతులకు నష్టం మిగిల్చింది. పలు గ్రామాల్లో నేలనంటిన సార్వా పంట మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ పైరు నీటిలోనే ఉంది. ముంపునీరు దిగే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఓల్డ్‌అయినాపురం డ్రెయిన్ ద్వారా తగిన స్థాయిలో ముంపునీరు దిగకపోవడంతో పైరు నీట నానుతోంది. ఇప్పటికీ ముంపునీరు బయటకు పోయే మార్గం లేక పంటను ఎలా రక్షించుకోవాలో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. మొలకెత్తుతున్న పైరును చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను ఒడ్డుకు చేర్చుకోవాలంటే వీలుకాని పరిస్థితిలో ముంపునీరు బయటకు పోయే మార్గాన్వేషణలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లోని ముంపునీరు బయటకు పంపే ఏర్పాట్లు తక్షణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఓల్డ్‌అయినాపురం డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించే చర్యలు చేపట్టాలని అభ్యర్థిస్తున్నారు.

అల్పపీడనం.. రైతుల ఆందోళన



అంబాజీపేట: మొసలపల్లిలో ధాన్యం పట్టుబడి చేస్తున్న కూలీలు

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు మరో అల్పపీడనం ప్రభావం కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు పంటను ఒబ్బిడి చేసుకునే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. యంత్రాలతో కోసిన పంటను కాపాడుకునేందుకు బరకాలు కప్పి భద్రపరుచుకుంటున్నారు. మండలంలో 30శాతంపైగా వరి కోతలు పూర్తికాగా ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని గంగలకుర్రు, కె.పెదపూడి, జగ్గన్నతోట, మొసలపల్లి ప్రాంతాల్లో ధాన్యాన్ని రోడ్డుపై ఆరోబోసి ఎండపెట్టారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసన



గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న హిందువులు

అమలాపురం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణ మారణకాండను నిరసిస్తూ ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన సభ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులు స్వేచ్ఛను కోల్పోయారన్నారు. హిందూ దేవాలయాలు, ప్రార్థనా సంస్థలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇస్కాన్ స్వామిజీ స్వామి కృష్ణదాస్‌ను అరెస్టు చేయడమే కాకుండా బెయిల్‌పై విడిపించేందుకు వెళ్లిన న్యాయవాది రామన్‌రాయ్‌పై అతి కిరాతకంగా దాడి చేసిన తీరును వివరించారు. సభలో బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, బులుసు జగదీష్, భజరంగ్‌దళ్ నాయకుడు శిరంగు నాయుడు, ఇస్కాన్ ప్రతినిధి శివానందనిమాయీదాస్ మాట్లాడారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో హిందబంధువులంతా ఒక్కటేనని మానవహారం నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు బాసటగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేశారు. వివిధ సంఘాల నాయకులు కల్వకొలను తాతాజీ, మోకా వెంకటసుబ్బారావు, నందూరి శ్రీరామ్, యేడిద శ్రీను, ఊటుకూరి సాంబయ్య, ఆర్వీ నాయుడు, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, గొవ్వాల అచ్యుత రామయ్య, గొవ్వాల నాగరాజు పాల్గొన్నారు.

గానగంధర్వ ఘంటసాల జయంతి

అమలాపురం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో బుధవారం గాన గంధర్వుడు ఘంటశాల వెంకటేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పలువురు ఘంటశాల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన కవిగా పనిచేసిన ఆయన స్వాతంత్రోద్యమంలోను పాల్గొన్నారని వక్తలు వివరించారు. ఘంటశాలకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, కుసుమే నరసింహరాజు, సాధనాల రామకృష్ణ, అప్పారి శ్రీనివాస్, ఎం.ఏసుబాబు, కముజు సుందరరావు, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే 112కు కాల్ చేయండి

అంతర్వేది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం హైస్కూల్‌లో బుధవారం మహిళా సంరక్షణ కార్యక్రమాన్ని పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా హెడ్ కానిస్టేబుల్ జి.నిర్మల, టి.సంధ్య విద్యార్థులకు మహిళల సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రులు, విద్య నేర్పే గురువుల అడుగుజాడల్లో నడుచుకుంటే నిర్దేశించిన లక్ష్యాలకు చేరుకుంటారన్నారు. ఆడ బిడ్డల కోసం ప్రభుత్వం అమలు చేసే చట్టాల గురించి విజేతలకు వివరించారు. పాఠశాలకు వచ్చేటప్పుడు, మీరుండే ప్రదేశాల్లో, ఇంటి వద్ద ఎక్కడైనా వేధింపులకు గురైన సందర్భంలో 112 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని, గుడ్ టచ్-బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం జాన కనకలింగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ జి.నిర్మల, టి.సంధ్య, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నాస్ సర్వే పరీక్షకు 2,432 మంది

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నాస్ సర్వే పరీక్షకు 2,432మంది హాజరైనట్టు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన నాస్ సర్వే పరీక్ష (పరాక్-2024)కు సంబంధించి 3, 6, 9 తరగతులకు చెందిన 2,432మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. జిల్లాలో 104 పరీక్షా కేంద్రాల్లో వారు ఈపరీక్షలు రాసినట్టు హనుమంతరావు తెలిపారు. 3వ తరగతికి సంబంధించి 674మంది, 6వ తరగతికి సంబంధించి 751మంది, 9వ తరగతికి సంబంధించి 1007మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను డీఈవో సలీంబాషా పరిశీలించారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చదవాలి

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఏకాగ్రతతో చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. నేషనల్ ఎచీవ్మెంట్ సర్వే(ఎన్ఏఎస్)లో భాగంగా 9వ తరగతి విద్యార్థుల్లో 30మందిని సర్వే బృందం ఎంపిక చేసిందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై చదివే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 10వ తరగతి పరీక్షలకు వంద రోజులు సమయం ఉండటంతో ప్రణాళికలు రూపొందించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతివిద్యార్థి అనుకున్న లక్ష్య సాధన కోసం కృషిచేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో భీమారావు, హెచ్ఎం కడలి సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్ పరిధిలో ఏడు పోలింగ్ స్టేషన్లు

పి.గన్నవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి కొత్తపేట డివిజన్ పరిధిలో ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన 58వ పోలింగ్‌బూత్‌ను ఆయన పరిశీలించారు. పోలింగ్ ఉదయం 8నుంచి 4గంటలు వరకు జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలో 806మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వారిలో 536మంది పురుషులు, 270మంది స్త్రీలు ఉన్నట్లు తెలిపారు. అనంతరం పోలింగ్ స్టేషన్‌లో పాటించాల్సిన నిబంధనలను తహశీల్దార్ పి.శ్రీపల్లవికి వివరించారు. బ్యాలెట్ బాక్స్‌ఏర్పాటు, ఓటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎస్ఐ బి.శివకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

అల్లవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని అమలాపురం ఆర్డీవో కె.మాధవి చెప్పారు. అల్లవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100మీటర్ల పరిధి వరకు బందోబస్తు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 144సెక్షన్ అమలులో ఉందన్నారు. అల్లవరం పోలింగ్ కేంద్రం పరిధిలో 74మంది ఓటర్లు ఉన్నారన్నారు. తహశీల్దారు వీవీఎల్ నరసింహారావు, డిప్యూటీ తహశీల్దారు ఏ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పోలింగ్ అధికారి మురళీ, ఏపీవో వీవీ గిరిబాబు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించారు. మండలంలో 129 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయన్నారు. ఈపోలింగ్‌కు నలుగురు సిబ్బందిని నియమించామన్నారు. ఉదయం 8నుంచి 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎంపీడీవో కార్యాలయంలో ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. మండలంలో 137ఓటర్లు ఉన్నట్టు ఈవోఆర్వో, తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి తెలిపారు. ఒక పీవో, ఏపీవో, ఓపీవోలు విధులు నిర్వహిస్తారన్నారు.

తేమ ఎక్కువగా ఉన్నా తరుగులు విధించవద్దు

అమలాపురం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ఉత్పత్తులకు ప్రస్తుత పరిస్థితుల్లో తేమ శాతం కొద్దిగా ఎక్కువగా ఉన్నా ఎటువంటి తరుగులు విధించకుండా కనీస మద్దతు ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మిల్లర్లకు సూచించారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు సాంకేతిక సహాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటూ రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తితే మండలస్థాయి, డివిజన్ స్థాయిలోను కంట్రోల్ రూములు ఏర్పాటుచేసి వారి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48గంటల్లో ప్రతీ రైతుకు ధాన్యం సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయని జేసీ చెప్పారు.

పారిశుధ్య కార్మికులు సేఫ్టీ కిట్లు ధరించాలి

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్‌కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పర్సనల్ ప్రొటెక్టివ్ కిట్లను ఉపయోగించాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మలు సూచించారు. నమస్తే ప్రోగ్రాంలో భాగంగా సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ పనుల్లో పాల్గొనే పది మంది పారిశుధ్య కార్మికులకు పీపీ కిట్లను పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ ఎ.సత్యనారాయణరాజు, టీపీవో రాజేష్‌బాబు, శానిటరి సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించాలి

ముమ్మిడివరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం నగరపంచాయతీ పరిధిలోని 20వార్డుల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు.నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులను అందరితో పాటు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. కమిషనర్ పి.రవివర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెప్మా సీఎంఎం ఎస్.భాస్కర్, సీవో రాజేశ్వరి, ఆర్పీలు, విభిన్న ప్రతిభావంతులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల్లో చైతన్యం తీసుకువస్తాం

రాజోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దళిత సాహిత్యంతోనే దళితుల్లో చైతన్యం తీసుకువస్తామని ప్రముఖ దళిత కవి ఎన్.రత్నాజీ అన్నారు. రాజోలులో దళిత కవులు, రచయితల సమావేశం దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసందర్భంగా ద కింగ్ ఆఫ్ నాగ సంస్థ వ్యవస్థాపకుడు, రచయిత డాక్టర్ ఎ.రాజబాబు మాట్లాడుతూ దళిత సమాజంలో మార్పు తీసుకురావడానికి దళిత కవులు, రచయితలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డొల్లా మార్టిన్ రాసిన అంబేడ్కర్ సూక్తుల పుస్తకాన్ని కవులు, రచయితలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ చిరంజీవి, చిలకపాటి శ్రీధర్, చింతా మధుకుమార్ పాల్గొన్నారు.

ఐఏఎస్ హర్షవర్ధన్ పూజలు

అంతర్వేది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సీనియర్ ఐఏఎస్ అధికారి హర్షవర్ధన్ బుధవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, వీఆర్వోలు సీతారామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పశువులు చూడు కట్టే సీజన్ ఇదే

అమలాపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాడి పశువులు చూడు కట్టే సీజన్ ఇదేనని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి చెప్పారు. ప్రస్తుత సమయంలో పశువులు చూడు కట్టకపోతే ఏడాది అంతా వృధా అవుతుందని రైతులకు సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో కాకినాడ పశుగణాభివృద్ధి సంస్థ, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈదరపల్లిలోని పశు వైద్యశాల వద్ద బుధవారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. నిపుణులైన పశు వైద్యాధికారులు శిబిరానికి వచ్చిన పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 70పాడి పశువులకు చికిత్స చేశారు.20ఆడ దూడలకు బ్రూసెల్లా టీకాలు వేశారు. పశు వైద్యాధికారులు డాక్టర్ మాధురి, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ వాసవితో పాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో ఉప్పు ద్రావణం పిచికారీ

ఉప్పలగుప్తం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫానుకు నీట మునిగిన సార్వా పొలాల్లో గింజలు మొలకెత్తకుండా బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో 5శాతం ఉప్పుద్రావణాన్ని పిచికారీ చేయించారు. పెదగాడవిల్లిలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ ఎం.నందకిశోర్, జిల్లా వనరుల వ్యవసాయాధికారి జేఎన్‌వీవీ మనోహర్‌కృష్ణ, మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.51,116 విరాళం

అయినవిల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరానికి చెందిన ఆలపాటి శ్యామల కుటుంబ సమేతంగా బుధవారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అన్నదాన ట్రస్టుకు రూ.51,116 విరాళాన్ని అందజేశారు. దాతకు ఆలయ ప్రధాన అర్చకుడు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి అభినందించారు.

6నుంచి రెవెన్యూ సదస్సులు

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు జె.వెంకటేశ్వరి తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. 6న ఇరుసుమండ, 9న పుల్లేటికుర్రు, 10న కె.పెదపూడి, 11న గంగలకుర్రు, 12న మాచవరం, 13న ఇసుకపూడి, 16న చిరతపూడి, 17ననందంపూడి, 18న తొండవరం, వాకలగరువు, 19న పసుపల్లి, 20న ముక్కామల, 21న వక్కలంక, 22న మొసలపల్లిలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ఇంటింటికీ ధర్మప్రచారం

మామిడికుదురు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా ఇంటింటికీ ధర్మ ప్రచార కార్యక్రమం బుధవారం మగటపల్లిలో జరిగింది. హైందవ శంఖారావడం పేరిట జనవరి 5న దేవాలయాలను రక్షించుకుందాం అనే నినాదంతో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి హిందువులంతా తరలివచ్చి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ ధర్మారావు కోరారు. ఫౌండేషన్ సభ్యులు ఇంటింటికి ధర్మ ప్రచార కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భైరిశెట్టి కోటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అమలాపురంటౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రూ.100 సభ్యత్వ రుసుంతో రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం టీడీపీ కల్పిస్తుందని టీఎన్‌టీయూసీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 3వవార్డులో ఇంటింటికీ తిరిగి బుధవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జి దేశినీడి శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్లు యాళ్ల గంగాధరరామారావు, చవటపల్లి రఘు, దూలం శ్రీరామమూర్తి, దున్నాల శ్రీనివాసరావు, దున్నాల సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య వర్ధంతి

ఉప్పలగుప్తం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య మూడో వర్ధంతిని బుధవారం భీమనపల్లిలో జరుపుకున్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రాము ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వరదా శ్రీరామచంద్రమూర్తి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువుల పరిశీలన



యానాం,డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి): యానాం శివారు దరియాలతిప్పలోని మంచినీటి చెరువులు అధ్వానంగా మారాయి. చెరువులో నాటు, పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో అధ్వానంగా ఉంటడంతో స్థానిక యువకులు, పలువురు బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానికులతో కలిసి చెరువులను మల్లాడి పరిశీలించారు. ప్రజాపనుల శాఖ అధికారులు తక్షణం స్పందించి చెరువులోని చెత్తా, చెదారం తొలగించాలని సూచించారు. అనంతరం తన స్వగృహంలో యానాం ప్రజాపనులశాఖ ఈఈ, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి, చెరువుల పరిస్థితిపై వివరించారు. స్థానికప్రజలకు మంచినీటిని అందిచడంతో పాటు చెరువును శుభ్రం చేయడం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రాపచింతలపూడి పంచాయతీ పరిధిలోని కొత్తకాలనీ పెదపేటకు చెందిన బూరుగ వెంకటేశ్వరరావు అలియాస్ కొండయ్య(63) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వరరావు-సత్యవతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆరేళ్ల క్రితం కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. కుమార్తెలకు వివాహం జరిపించాడు. భార్య సత్యవతి ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్వీపర్‌గా పనిచేస్తోంది. మనోవ్యాధికి గురైన వెంకటేశ్వరరావు మంగళవారం ఇంటి వద్ద ఉన్న మామిడి చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పి.గన్నవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): వైపీపాలెం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. పంచాయతీ నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని ఆమె తెలిపారు. పోలీసులు సహకారంతో రెవెన్యూ సిబ్బంది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారని, వాటికి జారిమానా విధిస్తున్నట్లు ఆమె తెలిపారు. అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా లంకలగన్నవరం బోట్స్‌మెన్ ర్యాంపులో డ్రెజ్జర్ ద్వారా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో డ్రెజ్జర్‌ను అక్విడెక్టు సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

బస్‌షెల్టర్‌లో వృద్ధురాలి మృతదేహం

అల్లవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోడిలంక బస్‌షెల్టర్‌లో భిక్షాటన చేసుకునే 70ఏళ్ల వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె శరీరంపై నాచు రంగు నైటీ ఉందని, గ్రామస్థుల సమాచారం మేరకు వృద్ధురాలి మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు

రాజోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్టు షాపులపై దాడులు నిర్వహించగా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెంలో ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనపరుచుకుని మద్యం అమ్ముతున్న మహిళను అదుపులోకి తీసుకున్నామని సీఐ కె.వీరబాబు బుధవారం తెలిపారు. ఎస్ఐ సీహెచ్ స్వామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట



ఆత్రేయపురం మహాత్మా గాంధీ హైస్కూల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేసేందుకే 'నాస్' పరీక్ష

రాయవరం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 4: విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేసేందుకే నాస్ పరీక్ష (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్షా ఏఎంవో పిల్లి రాంబాబు తెలిపారు. మండలంలోని లొల్ల యూపీ పాఠశాలలో బుధవారం జరిగిన నాస్ పరీక్షను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను గుర్తించడానికి, మరింత ఉన్నత ప్రమాణాలతో బోధన అందించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నాస్ పరీక్ష జరిగిన తీరును ఏఎంవోతో పాటు ఎంఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పరిశీలించారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గణించడానికి నిర్వహించిన నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2024) పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈవోలు పి.వరప్రసాదరావు, పి.సాహెబ్ తెలిపారు. మండలంలోని పేరవరం, ఉచ్చిలి జడ్పీ హైస్కూళ్లు, ఆత్రేయపురం మహాత్మాగాంధీ ఎయిడెడ్ పాఠశాల, మహర్షి, ఆదిత్య విద్యానికేతన్‌లలో ఈ పరీక్ష నిర్వహించారు. 150 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా రావులపాలెం డిగ్రీ కళాశాల అబ్బర్వర్లు పాల్గొన్నారు.



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మండపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏడిద రోడ్డులో గల రాజీవ్ గృహకల్ప కాలనీలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. అభయాంజనేయస్వామిని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కోన సత్యనారాయణ, గుత్తుల సత్తిబాబు, డి.వీరలక్ష్మి, రాజీవ్ గృహకల్ప కాలనీ వాసులు, అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు చిక్కం కొండ, బి.శివ, మండిపూడి చంద్రశేఖర్, సుంకర శ్రీను, కాళ్లకూరి సత్తిబాబు, ఊలి శ్రీను, శీతంశెట్టి సత్యనారాయణ, గుత్తుల శివ, యిల్ల సత్తిబాబు, కేతిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు నివాళి

కొత్తపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతిని బుధవారం స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోశయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోట్ల ప్రభాకరవిశ్వేశ్వరరావు, డాక్టర్ పి.కృష్ణారావు, శ్రీకాకోళపు బాబి, తమ్మన సాయిప్రసాద్, ఎ.నాగేశ్వరరావు, వడ్డి కృష్ణ, గాదిదుర్గాప్రసాద్, కంకటాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



తయారు చేసిన ఆహ్వాన పత్రికలతో విద్యార్థులు

ఆకర్షణీయంగా ఆహ్వాన పత్రికలు

కపిలేశ్వరపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆహ్వాన పత్రికలను విద్యార్థులు ఆకర్షణీయంగా తయారు చేశారు. వారిని హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు. ఆహ్వాన పత్రికలను విద్యార్థులే వారి తల్లిదండ్రులకు అందజేస్తారని చెప్పారు.



అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.47 లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.2,47,969 ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆత్రేయపురం-లొల్ల రహదారిపై ప్రమాదభరితంగా కల్వర్టు



లొల్ల వద్ద పంట కాలువపై రక్షణ గోడలు లేకపోవడంతో పొంచి వున్న ప్రమాదం

శిథిల కల్వర్టులు మృత్యుపాశాలు

ఆత్రేయపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఉత్పత్తులను తరలించేందుకు బ్రిటీష్ హయాంలో నిర్మించిన కల్వర్టులు నేడు శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇరిగేషన్ అధికారులు ఆధునికీకరణ చర్యలు చేపట్టకపోవడంతో అవి వాహనచోదకుల పాలిట మృత్యుపాశాలుగా మారాయి. లొల్ల-ఆత్రేయపురం పంట కాలువపై కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. లొల్ల నుంచి ర్యాలి సడక్ రోడ్డుకు వెళ్లే కల్వర్టుపై ర్యాంపు సక్రమంగా లేకపోవడమే కాక రక్షణ గోడలు కూడా విరిగిపోయాయి. దీంతో రైతులకు పంటలు తరలించడం కష్టతరంగా మారింది. పొంచివున్న ప్రమాదాలను నివారించడంతో పాటు శిథిల కల్వర్టులను బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం





కె.గంగవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు మృత్యుంజయరావు, రాయవరంలో పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఆలమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మం డలంలో 55 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గురువారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ ఏర్పాట్లపై ఎంపీడీవో ఎ.రాజు పోలింగ్ అధికారులతో చర్చించారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల బుధవారం పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఆర్డీవో పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 59 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు తహసీల్దారు ఐపీ శెట్టి వివరించారు.

మండపేట (ఆంధ్రజ్యోతి): మండపేట రూరల్, అర్బన్‌లకు సంబంధించి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు తహసీల్దారు పి.తేజేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే పోలింగ్‌లో 183 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆయన చెప్పారు. భారత ఎన్నికల సంఘం సూచించిన పది గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా చూపాలన్నారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు బండి మృత్యుంజయరావు పరిశీలించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో 76 ఓట్లు ఉన్నాయని, వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

సంక్రాంతికి పడవ పోటీలు: ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పడవ పోటీలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి లొల్ల లాకులను పరిశీలించారు. సంక్రాంతి మూడు రోజులు వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో అమలాపురం ప్రధాన కాలువలో పడవ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివిధ రాష్ట్రాల నుంచి సంక్రాంతికి కోనసీమ వచ్చే ప్రజలు ఈ పోటీలు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఆర్డీవో వెంట తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, టూరిజం ఏడీ రంగారావు, ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర, ఇరిగేషన్ జేఈ మాధవసాయిప్రసన్న, ఆర్ఐ భాను వున్నారు. అనంతరం ఆర్డీవో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉభయ గోదావరి జిల్లాలకు వారధి అయిన పిచ్చుకలంక పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు.



లొల్ల లాకులను పరిశీలిస్తున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, అధికారులు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు

ఆహ్వాన పత్రికలు పంపిణీ

కపిలేశ్వరపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈవో రాంబాబురెడ్డి, ఆలయ అభివృద్ధి సభ్యులు బుధవారం అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో డోలు, సన్నాయిలతో ఇంటింటికీ తిరిగి కల్యాణోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

శివలలో తాగునీటి కష్టాలు

కె.గంగవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివల గ్రామ ప్రజలు రెండు రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. రక్షిత మంచినీటి ట్యాంకు మోటారు చెడిపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. కొందరు తాగునీటి కోసం ప్రైవేటు వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు పక్క గ్రామాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. అధికారులు తక్షణం స్పందించి మోటారును బాగు చేయించి తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పాఠశాలలో కుళాయిల చోరీపై ఫిర్యాదు

రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల యూపీ పాఠశాలలో కుళాయిల చోరీపై హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డి రాయవరం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి పాత భవనం తాళం పగులగొట్టి ఉంది. సింక్‌లకు, వాటర్ ట్యాప్‌లకు ఉన్న సుమారు పది కుళాయిలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి ఉంటారని ఫిర్యాదులో హెచ్ఎం వివరించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలోని చిన్న మసీదు వీధికి చెందిన యువతి ఈ నెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కనిపించట్లేదని షేక్‌జానీ బుధవారం రామచంద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్ఐ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న మాలల 'చలో గుంటూరు'



రావులపాలెంలో సమావేశమైన మాలల సంఘ నాయకులు

రావులపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15న 'చలో గుంటూరు' సభకు మాలలు భారీగా తరలిరావాలని మాలల సంఘ నాయకులు పిలుపునిచ్చారు. రావులపాలెం ఆదిలక్ష్మీ నగర్‌లో బుధవారం గొల్లపల్లి డేవిడ్‌రాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ కన్వీనర్లు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, నెల్లి లక్ష్మీపతి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గుంటూరు సభ అనంతరం అమలాపురంలో మాలల సమారాధన పంక్తి నిర్వహిస్తామన్నారు. జిల్లా కమిటీ 22 మండలాలు తిరిగి ప్రతి ఒక్కరూ సభకు హాజరయ్యేలా కృషి చేయాలని తీర్మానించారు. సమావేశంలో కప్పల శ్రీధర్, వైపీ, కోనాల రాజు, గెడ్డం శ్రీనివాస్, గెడ్డం సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి'



విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న విద్యాప్రసన్న

రావులపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ డవలెప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బూసి విద్యాప్రసన్న దంపతులు విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ, వాటర్ బాటిల్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతగా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ గుత్తుల జ్యోతి, కో-ఆప్షన్ సభ్యుడు రాయుడు సత్యనారాయణ, నాయకులు చిట్టూరి సత్యనారాయణ, పమ్మి సత్యనారాయణ, కర్రి నరేంద్ర, కుసుమే రాంబాబు, ఉపాధ్యాయులు సీహెచ్ త్రిమూర్తులు, కె.కృష్ణకాంత్ పాల్గొన్నారు.



ఈవోకు చెక్కు అందజేస్తున్న గణేష్

భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్రాక్షారామ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన ట్రస్టుకు ద్రాక్షారామకు చెందిన ముప్పనపల్లి రామతులసి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం ఆమె కుమారుడు గణేష్ సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గా భవానికి అందించారు.



ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రాజు

హౌస్ హోల్డ్ సర్వే 88 శాతం పూర్తి

ఆలమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో హౌస్‌హోల్డ్ సర్వే 88శాతం పూర్తయిందని ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. 26,042 ఇళ్లకు సర్వే నిర్వహించాల్సి ఉండగా 88శాతం పూర్తి చేసి ముందంజలో ఉన్నట్టు చెప్పారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో హౌస్‌హోల్డ్ సర్వే, ఎంఎస్ఈ సర్వేలపై సమీక్షించారు. నూరు శాతం పూర్తి చేయాలని కోరారు. సర్వేల నివేదిక సమగ్రంగా ఉండేలా ప్రతి ఉద్యోగీ పనిచేయాలని సూచించారు.



పరంజ్యోతి చిత్రపటం వద్ద అమర్ రహే అంటూ నినాదాలు చేస్తున్న దృశ్యం

'పోరాట యోధుడు పరంజ్యోతి'

ఆలమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదలపక్షాన నిలిచి వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన యోధుడిగా గుర్రాల పరంజ్యోతి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు అన్నారు. బుధవారం మండలంలోని బడుగువానిలంకలో పరంజ్యోతి 19వ వర్ధంతి నిర్వహించారు. పరంజ్యోతి అమర్‌రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాయకులు పి.వెంకటేశ్వరుడు, రజ జాన్, తులారి ప్రేమానందం, బడుగు వెంకట్రావు, పొలుమాటి వెంకట్రావు, రేలంగి ఆదిలక్ష్మి, గరికిమిల్లి సుబ్బారావు, దబ్బా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.